క్లుప్తంగా

మక్తల్‌లో కంటి వైద్యశిబిరం



మక్తల్: పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ బీమా అధ్యక్షుడు సత్యఅంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో ప్రోగ్రామ్ చైర్మన్ అనుగొండ శ్రీనివాసులు సహకారంతో 80 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 30 మందికి కంటి పొరల సమస్య ఉండడంతో ఆపరేషన్ కోసం ఎనుగొండ కందూర్ రాంరెడ్డి కంటి ఆస్పత్రికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి అంజన్‌ప్రసాద్, కోశాధికారి సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ పృథ్వీరాజ్, డాక్టర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–1కు ఎంపికైన యువకుడికి సన్మానం



మక్తల్: గద్వాల్‌కు చెందిన పరుశురాం ఇటీవల విడుదలైన గ్రూప్–1 ఫలితాల్లో ఎంపీడీఓగా ఎంపికై సత్తా చాటాడు. అలాగే గ్రూప్–2లో ఎక్సైజ్ ఎస్‌ఐ ఉద్యోగం కూడా సాధించాడు. ఈ క్రమంలో రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పరుశరాంను జిల్లా నాయిబ్రహ్మణ సంఘం అధ్వర్యంలో మక్తల్‌లోని శ్రీపడమటి ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం ఘనంగా సన్మానించారు. పేదకుటుంబంలో పుట్టి ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడాన్ని అభినందించారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



మరికల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్నేహితుడి కుటుంబాన్ని పూర్వ విద్యార్థులు ఆదుకోని అతడి కుటుంబానికి భరోసా కల్పించారు. మరికల్ మండలం మాధవరం గ్రామానికి చెందిన కురుమూర్తి మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న అతడితో కలిసి పదో తరగతి వరకు చదువుకున్న మిత్రులు వెంటనే కురుమూర్తి కుటుంబాన్ని పరామర్శించి రూ.23,600 పోగు చేసి స్నేహితుడి భార్యకు అందజేశారు. అలాగే ఎప్పుడు ఏ అవసరం వచ్చిన ఆదుకుంటామని వారికి భరోసా ఇచ్చారు.

ఆలయానికి రూ.7,76,200 ఆదాయం



దేవరకద్ర: చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం తలనీలాల వేలం నిర్వహించారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి 2026 నవంబర్ 30వరకు తలనీలాలను పోగు చేసుకోడానికి రూ.4.91 లక్షలకు వన్నాడ గోపాల్ వేలం పాడి దక్కించుకొన్నాడు. కొబ్బరి కాయల వేలం జాతర సమయంలో ఒకనెలకు మాత్రమే రూ.2.76 లక్షలకు గోవర్ధన్ అనే వ్యక్తి దక్కించుకున్నాడు. కొబ్బరి చిప్పలు పోగు చేసుకోడానికి రూ.9200లకు కుర్మయ్య అనే వ్యక్తి వేలం పొందాడు. వేలాల ద్వారా ఆలయానికి మొత్తం రూ.7, 76, 200 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఈవో శ్యాం సుందర్, చైర్మన్ గోపాలాచార్యులు, రాఘవేంద్రాచార్యులు పాల్గొన్నారు.

లీకేజీ సమస్య పరిష్కరించాలి

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని కేశంపేట కొత్తతండాలో కొన్ని రోజులుగా మంచినీటి సమస్య తీవ్రంగా వేధిస్తోందని, వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని నెలలుగా సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని తండా వాసులు వాపోతున్నారు. ఇదే విషయాన్ని పంచాయతీ సెక్రటరీ పరుశురాములును వివరణ కోరగా, లీకేజీకి మరమ్మతు చేసేందుకు ప్రయత్నించగా రోడ్డు కింద పగిలిపోయిందన్నారు. రెండు రోజుల్లో లీకేజీని సరిచేసి మంచినీటి సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

చేనేతన్నకు చేయూత ఏది?



సహకార సంఘం భవనంలో బూజు పట్టిన మగ్గాలు

- సంఘంలో 153 మంది చేనేత కార్మికులు
- మూలన పడ్డ మగ్గాలు, సామగ్రి
- మరమ్మత్తుకు నోచుకోని భవనం

ఊట్కూర్: 'ఒకరి కోసం అందరు.. అందరి కోసం ఒకరు' నినాదంతో ఏర్పాటైన చేనేత సహకార సంఘాలకు ఆదరణ కరువైంది. చేనేతల సంక్షేమమే ధ్యేయంగా గత ప్రభుత్వం చేనేత సహకార సంఘాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా మండలంలోని చిన్నపొర్ల గ్రామంలో 40 ఏళ్ల క్రితం సంఘాన్ని ఏర్పాటు చేసి పక్కా భవనాన్ని నిర్మించి చేనేత కార్మికులకు పని కల్పించారు. సంఘంలో ఊట్కూర్, మక్తల్, చిన్నపొర్ల, పెద్దపొర్ల, పులిమామిడి గ్రామాలకు చెందిన 153 మంది చేనేత కార్మికులు సభ్యత్వం కలిగి ఉన్నారు. భవనంలో 15 మగ్గాలను ఏర్పాటు చేసి చేనేత కార్మికులకు పని కల్పించారు. ఇంటి దగ్గర మగ్గాలు ఉన్నవారికి ముడి సరుకు అందించారు. సంఘంలో తయారు చేయబడిన బట్టలు, చీరలను వ్యాపారస్తులకు అమ్మేవారు. అలాగే సంఘం ద్వారా కార్మికులకు బ్యాంకు ద్వారా సబ్సిడీ రుణాలను అందించేవారు. అయితే ప్రస్తుతం సంఘానికి ప్రభుత్వం ద్వారా నిధులు రాకపోవడంతో సహకార సంఘం మూతపడింది.

వృథాగా మగ్గాలు...

గ్రామంలోని చేనేత సహకారం సంఘం మూతపడడంతో సుమారు 25 మంది చేనేత కార్మికులు ఇతర పనులపై ఆధారపడి జీవిస్తున్నారు. దీంతో మగ్గాలు, రాట్నాలు బూజుపట్టి పాడైతున్నాయి. కొంత మంది మాత్రం కూలీకి చీరలు నేసి ఇస్తున్నారు. సంఘం ద్వారా ముడి సరుకు తీసుకొని చీరలు తయారు చేస్తే కూలీ ఎక్కువగా వచ్చేదని కార్మికులు వాపోతున్నారు. ఇప్పటికైన మంత్రి నిధులు మంజూరు చేసి సహకార సంఘాన్ని పునరుద్ధరించి తమకు దారి చూపాలని కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన చిన్నపొర్ల చేనేత సంఘం భవనం



భవనంలో వృథాగా నూలు కండెలు

కూలీకి చీరలు నేస్తున్నా...



గ్రామంలోని సహకార సంఘం మూతపడడంతో కూలీకి చీరలు నేసుకుంటూ జీవిస్తున్నాను. ఒక చీర నేస్తే రూ. 4 వేలు కూలీ ఇస్తున్నారు. నెలకు మూడు చీరలు తయారు చేసి ఇస్తా. సహకార సంఘం ద్వారా చీరలు తయారు చేసి ఇస్తే కూలీ ఎక్కువగా వచ్చేది. అధికారులు స్పందించి సహకార సంఘాన్ని పునరుద్ధరిస్తే తమలాంటి నేతన్నలకు సాయంగా ఉంటుంది.

–మతుకుంటి నీలప్ప, చిన్నపొర్ల

మంత్రి ఆదుకోవాలి



చేనేత సహకార సంఘం ఎన్నికలు 2017లో జరిగాయి. సంఘం మూడపడడంతో భవనంలో మగ్గాలు, ముడి సరుకు, ఇతర సామగ్రి వృథాగా పడి ఉంది. కార్మికులకు నేత పని లేక వివిధ పనులపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. సంఘానికి నిధులు మంజూరు చేయాలని నాయకులకు, అధికారులకు వినతి పత్రాలు ఇచ్చిన పట్టించుకోవడం లేదు. మంత్రి స్పందించి నిధులు మంజూరు చేయాలి.

–మండికి రామన్న, చిన్నపొర్ల

సంక్షేమ పథకాలు అందిస్తున్నాం

చిన్నపొర్లలో 25 మంది చేనేత కార్మికులు చీరలు నేస్తున్నారు. వారికి ప్రభుత్వం ద్వారా జియో ట్యాగ్ ద్వారా రుణాలు తదితర సంక్షేమ పథకాలను అందిస్తున్నాం. సహకార సంఘం మూత పడిన విషయం ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. నిధులు మంజూరు అయితే సంఘాన్ని పునరుద్ధరిస్తాం.

–బాబు, ఏడీ, నారాయణపేట జిల్లా

సర్పంచ్ ఎన్నికలపై పీఓలకు శిక్షణ

మద్దూరు: మండలంలో నిర్వహించే సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలపై పీఓలకు సోమవారం మద్దూరు బాలుర పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 24 పంచాయతీలు, 206 వార్డుల్లో ఏ విధంగా ఎన్నికలు నిర్వహించాలి అనే దానిపై విషయ నిపుణులు శిక్షణ ఇచ్చారు. పోలింగ్ సమయంలో పీఓలు అనుసరించాల్సిన విషయాలను ఎంపీడీఓ రహ్మతుద్దీన్ వివరించారు. 93 మంది పీఓలకు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రామన్న, పీఓలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్‌పై సిబ్బందికి శిక్షణ

మక్తల్: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో అధికారులకు పోలింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ రమేశ్, ఎంఈఓ అనిల్‌గౌడ్ పాల్గొని మండలంలోని 160 మంది ఎన్నికల సిబ్బందికి నిబంధనలను వివరించి అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పీఓలకు శిక్షణ ఇస్తున్న విషయ నిపుణుడు

'కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి'

నారాయణపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి గ్రామ గ్రామాన పార్టీ జెండా ఎగురవేయాలని మార్కెట్ చైర్మన్, ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్.శివారెడ్డి కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని సీవీఆర్ భవన్‌లో ఎన్నికల నేపథ్యంలో నారాయణపేట మండల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్ల స్థానాలకు పోటీ చేయాలనుకున్న ఆశావాహులు పేర్లు నమోదు చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరుస్తున్న ఆరు గ్యారంటీలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీఏ మెంబర్ పోషల్ రాజేష్, యువజన కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు కోట్ల మధుసూదన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు కోట్ల రవీందర్ రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్, టౌన్ ప్రెసిడెంట్ సలీం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మార్కెట్ చైర్మన్ ఆర్.శివారెడ్డి

హస్తం పార్టీలో చేరిక

దామరగిద్ద: మండలంలోని మొదుల్‌మడ్క గ్రామానికి చెందిన నాయకులు కుంభం శివకుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కుంభం శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజాసంక్షేమ పథకాలతో ఇతర పార్టీ నాయకులు ఆకర్శితులై పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, పార్టీ అంకిత భావంతో పనిచేసే కార్యకర్తలకు భవిష్యత్‌లో సముచిత స్థానం కల్పిస్తుందన్నారు.



కాంగ్రెస్ కండువా కప్పుకున్న కార్యకర్తలు

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం



మాట్లాడుతున్న పార్టీ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అరవింద్ కుమార్

నర్వ: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం నర్వలో మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్న ప్రభుత్వానికి స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. మండలంలోని అన్ని పంచాయతీలు, ఎంపీటీసీ స్థానాలతో పాటు, జెడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకునేలా కష్టపడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎన్నికల్లో ఓట్లు రాబట్టాలన్నారు. పార్టీ నుంచి ఎవరిని నిలబెట్టిన అందరు కలిసికట్టుగా పనిచేసి గెలుపునకు కృషి చేయాలన్నారు. సమావేశంలో మండల పార్టీ నాయకులు విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మన్న, మాజీ ఎంపీపీ జయరాములుశెట్టి, నాయకులు తిప్పారెడ్డి, రాదమ్మ, బీకే నర్సింహా, లంకాల్ విజయ్, అరవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

ఊట్కూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని మాజీ జెడ్పీటీసీ అరవింద్ కుమార్ అన్నారు. సోమవారం ఊట్కూర్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు పోటీచేసే అభ్యర్థుల పేర్లను సేకరించారు. అనంతరం మాట్లాడుతూ గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ హామీలు అమలు చేయకపోవడాన్ని ప్రజలకు వివరించి, బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాలన్నారు. ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని కోరారు. నాయకులు లక్ష్మారెడ్డి, ఆనంద్‌కుమార్, కోరం శివరాజ్‌రెడ్డి, కోరం వెంకట్‌రెడ్డి, వడ్ల మోనప్ప, రహిమాన్ పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

మద్దూరు: పట్టణంలో పునర్ నిర్మాణం చేపట్టిన కట్ట మైసమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం విగ్రహ ఊరేగింపు చేపట్టారు. స్థానిక వివేకానంద విగ్రహం నుంచి అమ్మవారి ప్రతిష్ఠాపన విగ్రహానికి వేద పండితులు రాఘవేంద్రచారి, రఘుచారి ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపును ప్రారంభించారు. పట్టణంలోని అన్ని దేవాలయాలు, బొడ్రాయి గుండా ఊరేగింపు నిర్వహించి, కాచెరువు దగ్గర విగ్రహానికి దాన్యభివాసం నిర్వహించారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠాపనకు యాగశాల ప్రవేశం చేపట్టారు. కార్యక్రమంలో కోస్గి మార్కెట్ కమిటీ చైర్మన్ భీములు, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, ఆలయ కమిటీ సభ్యులు వెంకటప్ప, వెంకట్‌రాములు, ప్రకాష్, రామకృష్ణ పాల్గొన్నారు.



కట్ట మైసమ్మ విగ్రహ ఊరేగింపు

జాతీయ మహాసభల్లో తపస్ బృందం

నారాయణపేట టౌన్: తపస్ అనుబంధ జాతీయ ఉపాధ్యాయ సంఘం ఏబీఆర్‌ఎస్‌ఎం జాతీయ మహాసభలు ఈ నెల 5 నుంచి జైపూర్‌లో ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఈ మహాసభల్లో నారాయణపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేర్ కృష్ణారెడ్డి, నరసింహా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా కోశాధికారి కిశోర్ కుమార్, మక్తల్ మండల అధ్యక్షుడు రవీందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన జాతీయ విద్యా విధానం, ఉత్తమ ఉపాధ్యాయుడు, విలువలతో కూడిన విద్య, పాఠశాలల వికాసం వంటి అంశాలపై చర్చించారు. అదే విధంగా దేశంలోని ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలని, అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తీర్మానించారు.



మహాసభలో పాల్గొన్న తపస్ సభ్యులు

విద్యార్థులకు వైద్యపరీక్షలు

మీపనగండ్ల: మండలంలోని తూముకుంట ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఆర్బీఎస్‌కే వైద్య బృందం విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. చిన్నారుల ఎదుగుదల, బరువు, రక్తహీనత తదితర వాటిపై అవసరమైన పరీక్షలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, జంక్ ఫుడ్ తినకుండా సంపూర్ణ ఆహారం తీసుకునేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని వైద్యాధికారి డాక్టర్ హరీష్ అన్నారు. ప్రధానోపాధ్యాయులు కిరణ్, హెల్త్ అసిస్టెంట్ స్వప్న, ఏఎన్‌ఎం ఉమ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తూముకుంటలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

కాంగ్రెస్ అభ్యర్థులను నిలదీయండి

కృష్ణా: అమలు చేయలేని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను స్థానిక ఎన్నికల్లో ప్రజలు నిలదీయాలని బీజేపీ ఉమ్మడి మండల ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు గడిచినా మహిళలకు 'మహాలక్ష్మి' పథకం క్రింద రూ.2500 ఇస్తానన్నా హామీతో పాటు చేయూత పథకం కింద పింఛన్ దారులకు పింఛన్‌ను రూ.4వేలకు పెంచుతానని ఇప్పటికీ నెరవేర్చలేదని విమర్శించారు. ఇక గ్రామాల్లో అభివృద్ధి కూడా జరగలేదని ఈ విషయాలపై ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు భరత్, సుమంత్, వీరేష్ తదితరులు ఉన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

నారాయణపేట టౌన్: స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ తేవడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 4న గోపాల్‌రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. అయితే సోమవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ క్రమంలో కోర్టు తీర్పు పట్ల బీసీ జాగృతి సేన తరపున బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. కాగా బీసీ రిజర్వేషన్లపై బుధవారం హైకోర్టు విచారణ జరపనుండగా తీర్పు అనుకూలంగానే వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

నారాయణపేట టౌన్: నారాయణపేట మండలంలో వెంటనే పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మండల బీజేపీ అధ్యక్షుడు జ్యోతి సాయిబన్న ఒక ప్రకటనలో అధికారులను కోరారు. ఈ సంవత్సరం భారీ వర్షాలకు పత్తి పంట పూర్తిగా దెబ్బతిందని, మిగిలిన పంటను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటివరకు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం సరికాదన్నారు. రైతులు నష్టపోకుండా వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలన్నారు. అదే విధంగా వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు సాధ్యమని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డా.శశిభూషణ్ అన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సోమవారం మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలోని ఏనుగొండలో ఫౌండేషన్ విత్తనాలతో సాగుచేస్తున్న పలువురు రైతుల పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విత్తనంతో పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. అనంతరం రైతులకు విత్తనోత్పత్తిలో మెలకువలను వివరించారు. ఏఈఓ ఎం.సునీత తదితరులు పాల్గొన్నారు.

కుక్కలు, పందుల బెడద నివారించండి

అమరచింత: పట్టణంలో కుక్కలు, పందుల బెడద నుంచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వాటిని నియంత్రించాలంటూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అజయ్ మాట్లాడుతూ పట్టణంలోని 4వ, 5వ వార్డులలో పందులు, కుక్కలు తీవ్ర స్థాయిలో సంచరిస్తున్నాయని, ఇవి చిన్నారులు, వృద్ధులపై దాడి చేసి గాయపరుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా వార్డులలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో మురుగులో పందుల సంచారం ఎక్కువైందని, వాటి వల్ల ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారన్నారు. ఇప్పటికే కుక్క కాటుతో పట్టణంలోని పలువురు ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కలు, పందులను వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ నాగరాజ్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు అరుణ్ కుమార్, విజయ్, సురేష్, నిషాంత్, అవాజ్ జిల్లా నాయకుడు షేక్ పాషా పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

పేదలకు చేయూతనిచ్చేందుకు కృషి

నారాయణపేట టౌన్: ఆపదలో ఉన్న పేదలకు చేయూతనిచ్చేందుకు తమ ఫౌండేషన్ ఎనలేని కృషి చేస్తుందని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రాజ్‌కుమార్ రెడ్డి అన్నారు. హైదరాబాద్, దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన కరాటే మాస్టర్ తీగల శ్రీనివాస్ కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని రాజ్‌కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వైద్యఖర్చుల నిమిత్తం రూ.25 వేలు అందజేశారు. విద్య, వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న ఎంతో మందికి తమ ఫౌండేషన్ ద్వారా సహాయ సహకారాలు అందజేయడంలో ముందుంటామన్నారు. భవిష్యత్‌లోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న రాజ్‌కుమార్‌రెడ్డి

దేవరకద్రలో నేడు ఉచిత వైద్య శిబిరం

దేవరకద్ర: మున్సిపాలిటీలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం ఆవరణంలో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9 గంటలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షులు హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య నిపుణుల ఆధ్వర్యంలో అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వైద్య పరీక్షలలో శస్త్ర చికిత్సలు అవసరం ఉన్న రోగులను ప్రత్యేక బస్సులో హైదరాబాద్ తీసుకెళ్లి శస్త్ర చికిత్సలు చేసిన అనంతరం తిరగి దేవరకద్రలో వదిలి వేయడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, చిన్నపిల్లలకు వివిధ రకాల వైద్య సేవలు ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీసీ రోడ్డు.. కూలేందుకు సిద్ధం



మండల పరిధిలోని కొల్పూర్ గ్రామంలో మూడుమాల్‌కు వెళ్లే దారిలో నిర్మించిన సీసీ రోడ్డు ప్రమాదకరంగా తయారైంది. కాంట్రాక్టర్ సీసీ రోడ్డుతో పాటు డ్రైయినేజీ నిర్మాణం చేపట్టాల్సి ఉన్న కేవలం రోడ్డు మాత్రమే నిర్మించి వదిలేయడంతో వర్షాల కారణంగా రోడ్డు కింద మట్టి మొత్తం కొట్టుకుపోయింది. దీంతో సీసీ రోడ్డు కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. రోడ్డు ప్రమాదకరంగా ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంపై గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే రోడ్డు పక్కన డ్రైయినేజీ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

– మాగనూర్